మళ్లీ ఆపరేషన్ కూల్చివేత

కోల్‌సిటీ, జనవరి 8: రామగుండం నగర పాలక సంస్థ మరోసారి ఆపరేషన్ కూల్చివేతకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈసారి నగరం నడిబొడ్డున గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ ఉన్న అనధికార దుకాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టబోతున్నట్లు సమాచారం. ఈ ప్రచారంతో చౌరస్తాలోని పలు దుకాణాల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లక్ష్మీనగర్‌లో రోడ్ల వెడల్పుతోపాటు అనుమతులు లేవన్న కారణంగా ఇటీవల దాదాపు 16 దుకాణాలను కూల్చివేసిన విసయం విధితమే. దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ముందుగా షాపింగ్ కాంప్లెక్స్‌కు తరలిస్తామని చెప్పిన అధికారులు కూల్చివేతల అనంతరం మాట మార్చారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మళ్లీ ఆపరేషన్ కూల్చివేతకు ప్రణాళికలు తయారు చేయడంలో నిమగ్నమైనట్లు తెలిసింది. షాపింగ్ కాంప్లెక్స్ పక్కన లక్ష్మీనగర్‌లో గల బుక్కగులాల దుకాణాలు 10 నుంచి 15 వరకు ఉంటాయి. వారంలో వాటిలో అనధికార దుకాణాలను గుర్తించి ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేసేందుకు చర్యలకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. షాపింగ్ కాంప్లెక్స్‌కు ముందు ఉన్న బడా దుకాణాలను కూడా కూల్చివేస్తారనే ప్రచా రం జరుగుతున్నది. వీటిలో పట్టా భూములను మినహాయించి అనధికార దుకాణాలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ వారంలో మళ్లీ కూల్చివేతలు జరిగే అవకాశాలున్నాయి.

షాపింగ్ కాంప్లెక్స్ పక్కన ఉన్నబుక్కగులాల దుకాణాలు

అనధికార దుకాణాలు తొలగిస్తాం...

నిజమే.. షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ ఉన్న దుకాణాల్లో చాలా వరకు అనధికార నిర్మాణాలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయి. వాటిని టౌన్ ప్లానింగ్ విభాగం పరిశీలిస్తున్నది. పట్టా భూములను మినహాయిస్తాం. షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో అనధికారికంగా కొనసాగుతున్న దుకాణాలను తప్పకుండా తొలగిస్తాం. షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకవచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జే.అరుణ శ్రీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్

దివ్యాంగుల అభ్యున్నతికి సహకారం

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

దివ్యాంగుల అభ్యున్నతికి రుణాలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు
- 198 మందికి సహాయ ఉపకరణాల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 8: దివ్యాంగులు సంఘాలుగా ఏర్పడితే బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని దాదాపు 138 మందికి రూ.27.50 లక్షల విలువచేసే సహాయ ఉపకరణాలను దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులందరికీ సహాయ ఉపకరణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేసి అభినందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి పి వేణుగోపాల్ రావు, కార్యాలయ పర్యవేక్షకుడు కొట్టె రాజయ్య, పెద్దపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, సురేందర్, పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్ నర్సింహారెడ్డి, సఖీ కేంద్రం కో ఆర్డినేటర్ స్వప్న, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొల్లూరి ఉమాదేవి, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ జితేందర్ కనుకరాజు, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించాలి

పెద్దపల్లి, జనవరి8: సుల్తానాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి గట్టెపల్లి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల పై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, దవాఖాన, ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించిన షెటర్లకు సంబంధించి వారికి సమాచారం అందించి వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణంలో పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్ ,మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, డీసీపీ ఎంచేతనతో కలిసి కలెక్టర్ రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్షించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ, వీటి వల్ల కలిగే దుష్పరిణామాల పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ బావ్ సింగ్ , మంథని ఆర్డీవో సురేష్, డీఈవో డీ మాధవి, డీడబ్ల్యూవో వేణు గోపాల రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దాసరి కల్పన, జిల్లా అటవీ అధికారి సీహెచ్ శివయ్య, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి, రవాణా శాఖ అధికారులు, అధికారులు, పాల్గొన్నారు.

వైద్యులను అభినందించిన కలెక్టర్

ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

పెద్దపల్లి టౌన్, జనవరి 8: పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేయడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష వారిని అభినందించారు. జూలపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన మహిళకు గర్భసంచితో పెద్ద గడ్డలు ఏర్పడ్డాయి. సర్జరీ చేసుకోవాలని వైద్యులు ఆమెకు సూచించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే విజయ రమణరావును కలిసి సర్జరీకి సహకరించాలని కోరారు. వెంటనే స్పం దించిన ఎమ్మెల్యే పెద్దపల్లి దవాఖాన సూ పరింటెండెంట్ శ్రీధర్‌తో మాట్లాడారు. అనంతరం బుధవారం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన వైద్యులు అనసూయ, శౌర య్య, శ్రీధర్ సర్జరీని విజయవంతం చేశా రు. కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యుల బృందా న్ని అభినందించారు. జిల్లా దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

గోదావరిఖని : క్యాలెండర్లు ఆవిష్కరిస్తునన అధికారులు

గోదావరిఖని, జనవరి 8: సింగరేణి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు జీఎం కార్యాలయం వద్ద రీజియన్‌లోని అన్ని విభాగాల అధికారులతో కలిసి జీఎం క్యాలెండర్‌ను విడుదల చేశారు. సింగరేణి సంస్థ సాధించిన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పచ్చదనం, ఉద్యోగుల సంక్షేమంపై ఫొటోలతో కూడిన క్యాలెండర్ సంస్థ సాధించిన పురోగతిని వివరిస్తుందని ఈ సందర్భంగా జీఎం పేర్కొన్నారు. ఇక్కడ ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, ప్రతి నిధి రాజు, ఏరియా ఇంజినీరు దాసరి వెంకటేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, ఎస్టేట్ డీజీఎం కుమారస్వామి, సివిల్ ఎస్ఐ వరప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, క్రాంతికుమార్ ఉన్నారు.

రక్షణతో కూడిన లక్ష్యాలను సాధించాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8 : రక్షణతో కూడిన వార్షిక లక్ష్యాలను సాధించి డివిజన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. బుధవారం జీఎం చాంబర్‌లో 2025 నూతన సింగరేణి క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం కార్యదర్శి జీగురు రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూధన్, ఇంజనీర్ నర్సింహారావు, ఎస్‌వోటు జీఎం రాముడు, డీజీఎం(ప) ఎస్ అనిల్ కుమా ర్, రక్షణాధికారి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామగిరి, జనవరి 8: సింగరేణి సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, ఏపీఏ జీఎం కే.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్లను వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న ఉద్యోగులకు అందజేయనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థకు సంబంధించి సమగ్ర సమాచారం ఈ క్యాలెండర్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఇంజనీర్ శేఖర్‌బాబు, డీజీఎం చంద్రశేఖర్, రాజారెడ్డి, సత్యనారాయణ, ఐలయ్య, గుర్రం శ్రీహరి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం,జనవరి8 : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మల్లాపూర్ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ దేవసేన బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన ధ్రువీకరణ, పత్రం,ఆధార్ జిరాక్సులతో https:// tgswreis. telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 1 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. గురుకులాల్లో 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఫిబ్రవరి 23న (5 నుంచి 9 తరగతులకు) ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసుల తీరు

- ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్ర
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసి రవీందర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామగిరి, జనవరి 8: మంథని నియోజక వర్గంలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేసి రవీందర్ ఆరోపించారు. సెంటినరీకాలనీలో బుధవారం ఆయన మాట్లాడారు. మంథనిలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని విమర్శించారు. అనుమతి అడిగితే ఇవ్వరని సమావేశమైతే అక్రమంగా కేసులతో వేధిస్తారని పేర్కొన్నారు. జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సెంటినరీకాలనీలో ఈనెల 9న సమావేశానికి అనుమతి కోరితే మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు జరుగుతున్నాయని, ఎమ్మెల్సీ కవిత సమావేశానిఇ అనుమతి నిరాకరించడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని విమర్శించారు. నియంత పాలన ఎంతోకాలం సాగదని ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. గురువారం నిర్వహించ తలపెట్టిన ఎమ్మెల్సీ కవిత సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. పోలీసులు అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా మరో తేదీని ప్రకటించి తెలంగాణ ఉద్యమ తల్లి విగ్రహానికి భూమిపూజ, బహిరంగ సభ నిర్వహించి తీరుతామని వెల్లడించారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, రైతుబంధు అధ్యక్షుడు మేదరబోయిన కుమార్, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా

జూలపల్లి : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జూలపల్లి, జనవరి 8 : గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు తెలిపారు. కాచాపూర్ నుంచి జూలపల్లి దాకా 7 కిలో మీటర్ల డబుల్ తారు రోడ్డు నిర్మాణ పనులు, వడ్కాపూర్‌లో పల్లె దవాఖాన భవనం నిర్మాణం, పద్మశాలీ సామాజిక భవనం పనులు, వెంకట్రావ్‌పల్లిలో పల్లె దవాఖాన పనులకు ప్రభుత్వం నిధులకు మంజూరు చేసింది. ఆయా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, ఏఎంసీ చైర్మన్ గండు సంజీవ్, వైస్ చైర్మన్ కొమ్మ పోశాలు, ఎంపీడీవో పద్మజ, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహంయాదవ్, మాజీ సర్పంచులు బంటు ఎల్లయ్య, బట్టు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

సుల్తానాబాద్, జనవరి 8 : సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన భోజన పథకాన్ని తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నట్లు పెద్ద పల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమ ణారావు తెలిపారు. ఈ పథకాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. 45 రోజుల పాటు తన సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం అందిస్తానని తెలిపారు. తాను ఇదే కాలేజీలో చదవుకున్నానని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడి యట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఏఎం సీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతాకృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి ఉన్నారు .

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

ఓదెల, జనవరి 8: పొత్కపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే విజయ రమణారావు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్

సీఎంపీఎఫ్‌పై సమీక్ష

గోదావరిఖని, జనవరి 8: సింగరేణి ఆర్జీ-1 సమావేశ హాలులో సీఎంపీఎఫ్ కో ఆర్డినేషన్ కమిటీ, పీఎఫ్ అండ్ పెన్షన్ అదాలత్ సమస్యల పరిష్కారానికి బుధవారం సమీక్ష నిర్వహించారు. గోదావరిఖని రీజియన్ సీఎంపీఎఫ్ కమిషనర్ శ్రీహరి పచౌరి ఉద్యోగుల పీఎఫ్ సమస్యలకు పరిష్కారాలు సూచించారు. పెన్షన్ చెల్లింపు, పెన్షన్ సవరణ, ఎన్‌సీడబ్ల్యూ ఏ11, రివైజ్డ్ పెన్షన్ క్లెయిమ్‌లు, ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులు, కాంట్రాక్టు వర్క్‌మెన్‌ల అడిట్‌షీట్, కాంట్రాక్ట్ డ్రైవర్లకు నెంబర్ల జారీ, ఎగ్జిక్యూటివ్ పెన్షన్ బకాయిల సమస్యలకు పరిష్కారాలు సూచించారు. జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం గోపాల్‌సింగ్, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీఎంవోఏఐ క్రాంతికుమార్, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీ బాయి, సీనియర్ పర్సనల్ అధికారులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు

ముత్తారం, జనవరి 8: మండల కేంద్రంలోని కాసర్లగడ్డలో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులు బుధవారం చర్యలు తీసుకున్నారు. కొంత కాలంగా లోవోల్టేజీ సమస్యలతో విద్యుత్ వినియోగదారులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో సమస్య రాకుండా ఉండేందుకు నూతన ట్రాన్స్ ఫార్మర్ కోసం విద్యుత్ లైన్ ఏర్పాటు చేయగా మార్గం మధ్యలో గ్రామానికి సంబంధించిన హైమాస్ట్ లైట్, చెట్లు అడ్డుగా ఉండటంతో కొన్ని నెలలుగా సమస్య అలాగే ఉండిపోయింది. దీంతో నూతనంగా ఏఈగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్ రెడ్డి తన సిబ్బందితో విద్యుత్ వినియోగదారుల సమస్యను పరిష్కరించేందుకు ఎంపిడిఓ సురేష్ తో మాట్లాడి హైమాస్ట్ లైట్ తొలగించి, అదేవిధంగా చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. సమస్యను పరిష్కరించినందుకు ఎంపిడిఓ, విద్యుత్ శాఖ అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 8: రోడ్డుపైకి వచ్చే ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని రామ గుండం ట్రాఫిక్ సీఐ బీ రాజేశ్వర్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడుపరాదని, హెల్మెట్ లేనిదే మోటార్ బైక్‌లను బయటకు తీయరాదన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

అంతర్గాం, జనవరి 8: మూర్మూర్ గ్రామానికి చెందిన గోపు మల్లేశ్(45) అనే వ్యక్తి మద్యం మత్తులో పశువుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతర్గాం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లేశ్ పశువుల(బర్రెలు) కాపరి. మద్యం తాగినప్పుడు మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చాడు. ఇంట్లో ఉన్న పశువుల మందు తాగి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కుక్కను తప్పించబోయి ఆటోబోల్తా

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8: మంగపేట శివారులో కుక్కను తప్పించబోయి ఆటోబోల్తా పడింది. ఈ ఘటనలో జమ్మికుంటకు చెందిన చొక్కారపు శ్రీనివాస్ (62) చనిపోయాడని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జమ్మికుంట నుంచి ఆటో గోదావరిఖని వెళుతుండగా మంగపేట శివారులో ఆటోకు కుక్క అడ్డం వచ్చింది. డ్రైవర్ దానిని తప్పించబోగా అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. డ్రైవర్ చొక్కారపు శ్రీనివాస్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. అదే ఆటోలో ఉన్న జమ్మికుంట మండలం మోత్కులగూడెంకు చెందిన ముక్కిరి రాయమల్లు, అతని భార్య భాగ్యకు గాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీనివాస్‌ను కాల్వశ్రీరాంపూర్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. శ్రీనివాస్ కుమారుడు అఖిలేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెయింట్ జోసెఫ్‌లో సైన్స్ ఫెస్టివల్

రాకెట్ లాంచర్ వినియోగాన్ని వివరిస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం), జనవరి 8: రామగుండంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో బుధవారం సైన్స్ ఫెయిర్ టెక్నోవ పేరిట నిర్వహించిన సైన్స్ ఫెస్టివెల్ ఆకట్టుకుంది. దాదాపు 400 సైన్స్ ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమ్రిన్ ఫాతిమా సలీంబేగ్, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బంధారపు యాదగిరిగౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ఇన్‌చార్జి హెచ్ఎం ఆశాలత, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

ప్రభావిత గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 8: ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్‌ను ఎమ్మెల్యే బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ హెచ్ఆర్ సోమనాథ్, అధికారి అజ య్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నూతన ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

జ్యోతినగర్, జనవరి 8: ఎన్టీపీసీ పరిధి రెండోడివిజన్ ఇందిరమ్మ కాలనీలో ఇటీవల లక్ష్మమ్మకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపల్లి మల్లేశ్ ఆధ్వర్యంలో బాధితురాలికి కొత్తగా నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రిబ్బన్‌కట్ చేసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో మొక్క నాటారు. బాధిత కుటుంబానికి కొత్త ఇల్లును నిర్మించిన సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

నిరుద్యోగులకు అండగా ఉంటా..

ఓదెల, జనవరి 8: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులకు అన్ని విధాలా అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. ఓదెల మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో బుధవారం పట్టుభద్రులతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కొలనూర్, పెగడపల్లి గ్రామాల్లో బైక్ ర్యాలీ తీశారు. ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. వివిధ శాఖల్లో అనేకంగా ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీకి చట్ట సభలో గళం విప్పనున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. పట్టుభద్రులు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి వారి సమస్యలను తీర్చడానికి పని చేస్తానన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇక్కడ వివిధ సంఘాల నాయకులు గట్టు యాదవ్, పల్కపాటి రాజేశ్‌కుమార్, దొడ్డె శంకర్, అంకం రమేశ్, శానగొండ బ్రహ్మచారి, రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెగడపల్లిలో ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8: ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి పెగడపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇక్కడ వీఎన్ఆర్ టీం సభ్యులు ముంజాల హరికృష్ణ, గోపగాని మల్లేశ్, తానిపర్తి తిరుపతిరావు, ఆరెల్లి రమేశ్, నజీర్ ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఓదెల, జనవరి 8: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల కార్యదర్శులతో బుధవారం సమావేశమయ్యారు. పారిశుధ్యం, పన్నుల వసూళ్లు, నర్సరీల నిర్వహణపై సూచనలు చేశారు.